# * అపవాదు *

...రచన: యేర్లగడ్డ శివరామకృష్ణ...

ఎవరి మొహం చూశానో గుర్తులేదుగాని ఆ రోజున నిష్కారణంగా నామీద పెద్ద అపవాదువచ్చిపడింది. ఆ అపవాదు ఎవరో నామీద వేసినట్టయితే నేనంత లెక్కచేసే వాడినిగాదు. సాక్షాత్తూ నామీదెంతో మంచి అభిప్రాయమూ, నమ్మకమూ కల మా యింటాయనే (నేను అద్దెకున్న యిల్లుగలాయన) వేశాడు. అందుకే నేనంత ఇదవ్వాల్సి వచ్చింది.

పదిరోజులక్రితం మా సుబ్బారావూ, ఆయన పెద్ద కూతురూ (భర్త వదిలిపెట్టిన కామాక్షి) లేచిపోవటంతో వచ్చిపడింది తిప్పలు. వాళ్ళు లేచిపోవటానికి నా సహకారం పూర్తిగావుందని మా ఇంటాయన నామీద వెయ్యరాని అభాండం వేశాడు. ఆయన దేన్ని ఆధారంగా తీసుకు నామీద ఆ అపవాదు వేశాడో నాకైతే తెలియదు.

నవ్వెంతో బుద్ధిమంతుడవనుకున్నానన్నాడు. నువ్వింత లుచ్ఛాపని చేస్తావని అనుకోలేదన్నాడు. మీ నాన్న పేరు నాశనం చెయ్యటానికి బయలుదేరావన్నాడు. ఆపైన తననోటితో నన్నాయన డాఫరనక్కర్లేదు.

ఆయనమీద తాళప్రమాణాన కోపం వచ్చినా దాంతో ప్రయోజనం వుండదనే వుద్దేశ్యంతో నిగ్రహాన్ని పాటించాను.

'సుబ్బారావుని స్నేహధర్మంవల్ల రూమ్‌లోనికి రానిచ్చానుగాని ఈ విషయంలో యింకేం అభిప్రాయమూ నాకులేదు. నే నే పాపమూ ఎరగనుస్వామీ' అని నేనెంతగా మొరపెట్టుకున్నప్పటికీ ఆయన నా మాట ససేమిరా నమ్మనన్నాడు. 'ఏ వొట్టుపెడితే ఆవొట్ట'న్నాను. 'చదువుకున్నవాళ్ళ వొట్లు నమ్మను పొమ్మ'న్నాడు.

ఈ వ్యవహారం విపులంగా చెపుదాం అనుకున్నానుగాని చెప్పినా ఆయన నమ్మతాడన్న గ్యారంటీ కనిపించలేదు.

స్నేహితుడైతే అయ్యాడుగాని సుబ్బారావుమీద మండుకొచ్చింది. లేకపోతే ఏమిటి? వెధవ లేపుకుపోతున్నవాడు యే గొడవా లేకుండా నిశ్శబ్దంగా లేపుకుపోవాలి గాని నావంటివాడిమీద ఇటువంటి రిమార్కు తెచ్చిపెడతాడా? నామీద ఇంటాయనకున్న సదభిప్రాయాన్ని వమ్ముచేసివదిలిపెడతాడా? కనపడితే వెధవని తలవాచేట్లు చీవాట్లుపెడుదును. ప్చ్! వాడింకా కనపడతాడా? ఈ రోజున ఎన్నివందల మైళ్ళదూరాన వున్నాడో! కామాక్షి పట్టుకెళ్ళిన పాతిక వేలుంటే వందల మైళ్ళేం ఖర్మ!

ఆయన చీవాట్లువేసి ఊరుకున్నట్టయితే ఎలాగోలాగు భరించివుండేవాణ్ణి. ఆయనకీ మా నాన్నకీ స్నేహం వుండటంవల్ల పెద్ద చిక్కే కలిగింది. ఆయన నేను భయపడ్డంత పనీ చేశాడు.

మహానుభావుడు నాలుగు పేజీల ఉత్తరం రాసి దానిమీద మావూరు అడ్రసు రాశాడు.

ఆ నాలుగు పేజీల ఉత్తరాన్నీ చేతబట్టుకుని మూడోనాటికి నాన్నగారు ఊడిపడ్డారు.

ఇన్నేళ్ళొచ్చినా నాన్నగారంటే భయమే. భోజనాలూ అవీ అయిన తరువాత నాన్నగారూ, ఇంటాయనా నాగదిలోకొచ్చి తిష్టవేశారు. ఏంజరిగిందో సవివరంగా చెప్పమన్నాడు నాన్నగారు. 'నా యెదట నువ్వు నిజం చెబుతావని నమ్మకం వుంది' అన్నారు. (ఆ మాటకి యింటాయన నాన్నగారివంక 'మోసపోతున్నావయ్యా' అన్నట్టు చూశాడు. నాకు నిజంచెప్పే అలవాటుందని ఆయనకి ఏకోశానా నమ్మకం వున్నట్టు కనపడదు.) నాన్నగారిముందర జరిగిందంతా చెప్పటానికి ఉపక్రమించాను.

* * *

కామాక్షికి కథల పుస్తకాలూ, నవలలూ అంటే పిచ్చి. ఆ తరగతి పిచ్చాడినే అయిన నాదగ్గర ఆ పుస్తకాలు యెక్కువ మొత్తంలోనే వున్నై. ఒక యింట్లో వుంటున్న కారణాన ఆ పరిచయాన్ని పురస్కరించుకుని తండ్రి అనుమతితోనే ఆఅమ్మాయి నారూముకొచ్చి పుస్తకాలు తీసికెళ్తూవుండేది. నేను ఆమె కావాలన్న పుస్తకాలు యిస్తూ చదివేసిన పుస్తకాలు తీసుకుంటూ వుండటంతప్ప చనువుగా మాట్లాడి యెరగను. ఇంతకుమించి మా పరిచయం అవధులు దాటలేదు. అప్పుడప్పుడూ సుబ్బారావు నా రూముకి కేవలం కాలక్షేపంకోసమే వచ్చి వెళ్తూవుండేవాడు. కొన్నాళ్ళకి వాడు కామాక్షివంక అదేపనిగా చూసి కుతూహలపడటం నేను గమనించి తేలిగ్గా నాలుగు చీవాట్లుపెట్టాను. వాడు నవ్వేసి వూరుకున్నాడు. తరువాత వాడి ప్రవర్తన మారినట్టనిపించి దాన్నిగురించి నేను అంతగా పట్టించుకోలేదు.

మళ్ళీ కొన్నిరోజులకు కామాక్షీ, సుబ్బారావూ ఒకర్నొకరు నిశ్శబ్దంగా నవ్వుకుంటున్నట్టు అనుమానించాను. సుబ్బారావుని అడిగేశాను.

"పోరా నీవన్నీ అనుమానాలు. మొగాడూ, ఆడదీ సోషల్‌గావున్నట్టు కనిపించగానే ఎందుకురా వాళ్ళిద్దరికీ సంబంధం కల్పించాలని ఆరాటం..." వాడిధోరణి యింకా కొనసాగింది. కానేపక్కడేవుంటే ఉపన్యాసం చెపుతాడేమోనని భయపడి అచటినుండి తప్పుకున్నాను.

ఆ తరువాత చాలాసార్లు వాళ్ళిద్దరూ అంటే కామాక్షీ - సుబ్బారావూ చనువుగా మాట్లాడుకోటం గమనించాను. కాని అప్రుడు నేనేమీ సుబ్బారావుని నిలవనియ్యలేదు. ఎందుకంటే సోషల్‌గా వుంటున్నవాళ్ళిద్దర్నీ గురించీ వెధవ అనుమానాలు పెంచుకోవటం బుద్ధితక్కువనిపించింది.

కాని నేను సుబ్బారావు విషయంలో మట్టుకు పొరపాటే పడ్డాను. వాడు కోసే కోతలుచూసి వాడ్ని సోషల్ రిఫార్మర్ కంటే వేరేవిధంగా చూడటం పొరపాటని భావించాను. కాని నవంబరు పదో తారీఖున అంతా అయిపోయిన తరువాత వాడు అర్థమయినాడు.

* * *

"టూకీగా చెప్పాల్సివస్తే యింతే. ఐతే నిజం టూకీగా చెప్పటంలో మరుగుపడలేదు. ఇది పచ్చి నిజం అని చెప్పటంకంటే మించి యింకేమీ చెప్పలేను. ఇక నామీద వేరే అభిప్రాయంమాత్రంపడితే నేనందుకు బాధ్యుడ్నవటం జరగదు" అని ముగించాను.

"అయితే నిజమింతేనని వొప్పుకుంటావా సుందరం" అన్నారు ఇంటాయన నాన్నవంక చూసి.

"వెంకటపతీ ఇదివరకు ఏవిషయంలోనూ వీడు నాదగ్గర అబద్ధం ఆడటం జరగలేదు. ఈ విషయంలోగూడా అంతేనని నా నమ్మకము" అన్నాడు నాన్నగారు.